కరపత్రం

SINCE 2014

శుక్రవారం సెప్టెంబర్ 25,2026 సంపుటి : 2 సంచిక : 347 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

రేవంత్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

‘బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026’ అవార్డు

- రైతు, బీసీ సంక్షేమానికి గుర్తింపు
- నిలంబూర్‌లో రేపు అవార్డు ప్రదానం
- రూ.లక్ష నగదు బహుమతి
- ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేత
- ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ పురస్కారం
- కేరళలో ఘనంగా అవార్డు వేడుక
- రేవంత్ పాలనకు అంతర్రాష్ట్ర గుర్తింపు
- శుక్రవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేసే ప్రతిష్టాత్మక ‘ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026’ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు (బీసీలు) , సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల పరిపాలనా వైఖరికి ప్రాధాన్యమిస్తూ ఈ గౌరవ పురస్కారాన్ని ప్రకటిస్తున్నట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ వెల్లడించారు.

రైతు, బీసీ సంక్షేమ పాలనకు ప్రాధాన్యత.. జ్యూరీ ప్రశంసలు

ఈ అవార్డు ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్ , ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ సభ్యులుగా ఉన్న ఉన్నత స్థాయి జ్యూరీ వ్యవహరించింది. తెలంగాణను ప్రగతిపథంలో నడిపించడంలో సీఎం రేవంత్ రెడ్డి కనబరిచిన దూరదృష్టి, ప్రజాస్వామిక విలువల పట్ల ఆయనకున్న అపారమైన నిబద్ధతను జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్న పాలనకు గుర్తింపుగానే ఈ అంతర్రాష్ట్ర పురస్కారం దక్కిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రేపే అవార్డు ప్రదానోత్సవం.. ఏఐసీసీ కీలక నేతల హాజరు

ఆర్యదాన్ ముహమ్మద్ నాల్గవ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఘనంగా ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతితో పాటు విశేష ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. ఈ వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేయనున్నారు.

ప్రజానేత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఏర్పాటు

కేరళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవడమే కాకుండా, వివిధ మంత్రివర్గాల్లో నాలుగుసార్లు కీలక శాఖలకు మంత్రిగా సమర్థవంతమైన సేవలు అందించారు. అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా, నిజాయితీ , లౌకిక విలువలకు మారుపేరుగా కేరళ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఆయన స్మారకార్థం ఈ అవార్డును నెలకొల్పారు. అటువంటి మహనీయుడి పేరిట ఏర్పాటైన ఉత్తమ ప్రజా సేవకుడి పురస్కారానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎంపిక కావడం విశేషం.

2 లో

ఖైరతాబాద్‌కు త్వరలో ఉప ఎన్నిక

- దానం నాగేందర్‌పై అనర్హత వేటు
- హైకోర్టు తీర్పునే సమర్థించిన సుప్రీం
- అసెంబ్లీ నుంచి ఈసీకి సమాచారం
- అతిత్వరలో షెడ్యూల్ ప్రకటించే అవకాశం

హైదరాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గ విషయంలో ఉత్కంఠకు తెర పడింది. ఫిరాయింపుల వ్యవహారంలో దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయగా.. ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే సర్వోన్నత న్యాయస్థానం కూడా ఇవాళ ఉన్నత న్యాయస్థానం తీర్పునే సమర్థించడంతో ఆయనకు ఎదురు దెబ్బ తగిలినట్లైంది.ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 151గా ప్రకారం సాధారణంగా శాసనసభలో ఏర్పడిన ఖాళీని ఆరు నెలల్లోపు ఉప ఎన్నిక ద్వారా భర్తీ చేయాలి. అయితే మిగిలిన పదవీకాలం ఏడాది కంటే తక్కువగా ఉండటం వంటి చట్టపరమైన మినహాయింపులు ఉన్నాయి. కానీ, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి వీలైనంత త్వరగానే ఉప ఎన్నిక తేదీని ఈసీ నిర్వహించే అవకాశం కనిపిస్తోంది.

జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి: రాహుల్ గాంధీ

దిల్లీ: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

2లో..

బ్యాంకు ఖాతాల నిర్వహణకు నాంపల్లి కోర్టు అనుమతి.

- రోజువారీ లావాదేవీలకు ఖాతాలు వాడుకోవచ్చని ఆదేశాలు.
- ఖాతాల్లోని రూ.3 కోట్ల నగదు విడుదలకు నిరాకరణ.
- ఆర్థిక ఇబ్బందులపై రవి తరపు న్యాయవాది పిటిషన్.
- ఖాతాల వినియోగానికి గ్రీన్ సిగ్నల్.. నగదుపై కొనసాగుతున్న ఫ్రీజ్.

హైదరాబాద్: సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ ‘ఐబొమ్మ’ కేసులో నిర్వాహకుడు రవికి నాంపల్లి కోర్టులో ఒకేసారి సంతోషం,షాక్ తగిలినట్లైంది.

2 లో

యూపీ వ్యాపారవేత్త వినీత్ మనోచా హత్య కేసులో ట్విస్ట్

కాన్పూర్: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారవేత్త వినీత్ మనోచా (60) హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కిరాయి హంతకుడితో తండ్రిని చంపించినట్లు కుమారుడు సుబ్రత్ మనోచా అంగీకరించాడు. ఈ హత్యతో తన భార్య షాలు మనోచాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు.

నిరుద్యోగులకు భారీ గుడ్‌న్యూస్

- డిగ్రీ కాలేజీల్లో 544 పోస్టులు
- త్వరలో టీజీపీఎస్సీ నోటిఫికేషన్
- 491 అధ్యాపకులు.. 24 లైబ్రేరియన్లు
- 29 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు

2లో..

2లో..

సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయం

- దానంపై అనర్హత తీర్పు సమర్థన
- భాజపా న్యాయపోరాటం ఫలితమే
- ఫిరాయింపులపై ఏలేటి ఫైర్
- పార్టీ మారిన ఎమ్మెల్యేల రాజీనామాకు డిమాండ్

2లో..

కొత్త పెన్షన్లపై గుడ్‌న్యూస్

- దరఖాస్తుల పరిశీలన గడువు పొడిగింపు
- సెప్టెంబర్ 30 వరకు అవకాశం
- జిల్లా కలెక్టర్లకు సెర్ప్ ఆదేశాలు
- అర్హులకు నెలనెలా పెన్షన్

కొత్త ఫించన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఇదో గుడ్‌న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే కొత్తగా ఫించన్ల కోసం అప్లై చేసిన వారి దరఖాస్తుల పరిశీలన గడువును మరోసారి పెంచుతున్నట్లు సెర్ఫ్ పేర్కొంది. సెప్టెంబర్ 30కి గడువును పొగడిస్తున్నట్లు సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ స్పష్టం చేశారు.

2లో..

గుండెపోటుతో ప్రణయ్ హత్య కేసు ఖైదీ మృతి

హైదరాబాద్: ఎనిమిదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో సంచలన సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న అబ్దుల్ బారీ గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం(సెప్టెంబర్ 24వ తేదీ)చర్లపల్లి జైలులో తీవ్ర అస్వస్థతకు గురైన బారీ మృత్యువాత పడ్డాడు. అస్వస్థతకు గురైన క్రమంలో అతన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే గుండె పోటుకు గురై మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నల్గొండలోని ప్యారసాభగ్ కాలనీకి చెందిన అబ్దుల్ బారీ.. ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2025 మార్చి నెలలో నల్గొండ కోర్టు అతనితో పాటు పలువురికి జీవిత ఖైదు విధించగా, కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మకు మరణశిక్ష విధించింది.

సజ్జనార్‌పై కౌశిక్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

- నిమజ్జన వేడుకల్లో కేసీఆర్ పాటలపై వివాదం
- పాటలు పెడితే కేసులు పెడతామని పోలీసుల బెదిరింపులంటూ ఆరోపణ
- ‘సజ్జనార్.. తెలంగాణ నీ జాగీరా?’ అంటూ ప్రశ్న
- ‘మేం మళ్లీ అధికారంలోకి వస్తాం’ అంటూ వ్యాఖ్యలు
- ‘సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకొస్తాం’ అంటూ హెచ్చరిక

2లో..

హైదరాబాద్: హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌పై బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వినాయక విగ్రహం నిమజ్జన వేడుకల సందర్భంగా సీపీకి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. నిమజ్జన వేడుకల్లో యువత మాజీ సీఎం కేసీఆర్ పాటలు పెట్టుకుంటుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. పాటలు పెట్టుకుంటే యువతపై కేసులు పెడతామని పోలీసులు బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సజ్జనార్‌ని ఉద్దేశిస్తూ.. సజ్జనార్ తెలంగాణ నీ జాగీరా?. రెండేళ్లలో రిటైర్ అవుతున్నానని అనుకుంటున్నారేమో.. మేం మళ్లీ అధికారంలోకి వస్తాం. సప్త సముద్రాల అవుతల ఉన్నా పట్టుకొస్తామని’ హెచ్చరించారు

ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా

2లో..

- ప్రజల్లో నాకు బలముంది: దానం
- ఉపఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత
- మూడుసార్లు గెలిచా.. మళ్లీ గెలుస్తా
- జూబ్లీహిల్స్ ఫలితమే రిపీట్: దానం

హైదరాబాద్: ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు బలముందని చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు.

“ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది.

హైదరాబాద్ లో టీజీ సేఫ్ స్పెషల్ డ్రైవ్.. లక్కీ సహా 8 రెస్టారెంట్ల లైసెన్స్ లు రద్దు

2 లో

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో రెస్టారెంట్లపై TG SAFE స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. 2026 సెప్టెంబర్ 24న మొత్తం 8 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్‌తో 15 రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న లక్కీ రెస్టారెంట్ తో పాటు మరో 7 రెస్టారెంట్ల లైసెన్సులు టీజీ సేఫ్ అధికారులు రద్దు చేశారు.

ఐబొమ్మ రవికి ఊరట

మొదటిపేజీ తరువాయి

పోలీసులు సీజ్ చేసిన బ్యాంకు ఖాతాలను రోజువారీ లావాదేవీల కోసం ఉపయోగించుకోవచ్చని న్యాయస్థానం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ ఖాతాల్లో ఉన్న సుమారు రూ.3 కోట్ల నగదును అన్‌ఫ్రీజ్ చేయడానికి మాత్రం కోర్టు నిరాకరించింది.

తన బ్యాంకు ఖాతాలన్నీ సీజ్ కావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానని, కుటుంబాన్ని కూడా పోషించలేకపోతున్నానని రవి తరఫు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫ్రీజ్ చేసిన రూ.3 కోట్ల నగదును కూడా వెంటనే రిలీజ్ చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

ఖాతాల వాడకానికే గ్రీన్ సిగ్నల్

పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. రవి తన అవసరాల నిమిత్తం ఆ బ్యాంకు ఖాతాలను సాధారణ లావాదేవీల కోసం ఉపయోగించుకోవడానికి మాత్రం అనుమతినిచ్చింది. అయితే, ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్ల నగదును విడుదల చేయడానికి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల ఖాతాలు ఆపరేట్ చేసుకోవడానికి అవకాశం దక్కినప్పటికీ, ఆ భారీ మొత్తానికి సంబంధించి ప్రస్తుతానికి ఊరట లభించలేదన్న స్పష్టత వచ్చింది.

గుండెపోటుతో ప్రణయ్ హత్య కేసు ఖైదీ మృతి

మొదటిపేజీ తరువాయి

2018 సెప్టెంబర్ 14వ తేదీన ప్రణయ్ కుమార్ హత్యకు గురయ్యాడు. అమృతను ప్రణయ్ పెళ్లి చేసుకున్న క్రమంలో ఆమె తండ్రి మారుతీరావు.. ప్రణయ్‌ను హత్య చేయించినట్లు ఆరోపలున్నాయి.. పోలీస్ చార్జ్‌షీట్‌లో వివరాల ప్రకారం అబ్దుల్ కరీం, అబ్దుల్ బారీ, అస్ఘర్ అలీలు కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మ సాయంతో ప్రణయ్‌ను హత్య చేశారు. దీనికి గాను కోటి రూపాయల వరకూ డీల్ కుదిరినట్లు ఆరోపణలున్నాయి. భార్య అమృతతో కలిసి ఆసుపత్రి నుండి బయటకు వస్తున్న ప్రణయ్‌ను శర్మ వెంబడించి కత్తి దాడి చేసి హత్య చేశారు.

విచారణ జరుగుతుండగానే మారుతీరావు మృతి

ఈ కేసులో ప్రధాన నిందితుడైన అమృత తండ్రి మారుతీరావు.. 2020 మార్చి 8న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ పరిధిలో ఉన్న ఒక గెస్ట్‌హౌస్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ హత్య కేసుకు సంబంధించి విచారణ జరుగుతున్న సమయంలోనే మారుతీరావు ఆత్మహత్య చేసుకోవడం? కలకలం రేపింది. ఆ సమయంలో మారుతీరావు రాసిన ఒక సూసైడ్ నోట్‌ను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో 2025 తీర్పు వెలువడగా బారీతో సహా ఆరుగురి నిందితులకు జీవితఖైదు పడగా కాంట్రాక్ట్ కిల్లర్ శర్మకు మరణశిక్ష పడింది. ఇదిలా ఉంచితే, గుజరాత్ మాజీ హోం మంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులో బారీని గతంలో అరెస్టు చేశారు; అయితే, ఆ కేసులో బారీ నిర్దోషిగా విడుదలయ్యారు

దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భాజపా చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టులు, క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని విమర్శించారు. ఇకనైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉపఎన్నికకు వెళ్లాలన్నారు.

ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా

మొదటిపేజీ తరువాయి

ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్ అన్నారు.

జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి: రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి

'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు.

మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకు ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ అప్రూవర్‌గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూపీ వ్యాపారవేత్త వినీత్ మనోచా హత్య కేసులో ట్విస్ట్

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు సుబ్రత్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. భార్యే తన తండ్రిని హత్య చేయించిందని పేర్కొన్నాడు. కిరాయిహంతకుడిని నియమించి చంపించిందని ఆరోపించాడు.ంి

'మారిషస్‌ను శుభ్రంగా ఉంచుతున్నారు.. మరి భారత్‌లో ఎందుకీ దుస్థితి?'

అయితే, అతడి ప్రవర్తన, ఇతరులు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులు షాలు, మాజీ ఉద్యోగి విశాల్ గౌతమ్‌లతోపాటు సుబ్రత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో అతడు నేరాన్ని అంగీకరించాడు. తానే విశాల్‌కు డబ్బులిచ్చి హత్య చేయించానని, ఒకవేళ పట్టుబడితే భార్య పేరు చెప్పాలని కోరానని పోలీసులకు చెప్పాడు. పోలీసులు షాలుకు క్లీన్ చిట్ ఇవ్వలేదు. ఈ ఘటనలో ఆమె పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఆస్తి కోసమే హత్య చేయించాడా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. విశాల్ సమాచారం ప్రకారం.. వినీత్ మనోచాకు వేరే మహిళతో సంబంధం ఉంది. ఆమెకు పుట్టిన పిల్లలకు ఆస్తిని రాసేస్తాడనే ఉద్దేశంతో.. ముందుగానే తండ్రిని హత్య చేసేందుకు సుబ్రత్ పన్నాగం పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కొత్త పెన్షన్లపై గుడ్‌న్యూస్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో కొత్త చేయూత పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిగ్ అప్‌డేట్. కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలన గడువును మరోసారి పెంచుతున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు ఈ దరఖాస్తుల పరిశీలనకు సెప్టెంబర్ 25 వరకు మాత్రమే ఉండగా.. దాన్ని సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీల్డ్ స్థాయి అధికారులు ఎస్ఐఆర్ విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో బిజీగా ఉండటంతో దరఖాస్తుల పరిశీలనను నిర్ణీత సమయంలో పూర్తి చేయలేకపోయారని.. దీంతో దరఖాస్తు పరిశీలన గడువు పొడిగించాలని అధికారులు కోరారని.. వారి చేసిన విజ్ఞప్తుల మేరకు సెర్ప్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె స్పష్టం చేశారు.

తాజా ఉత్తర్వుల ప్రకారం, సెప్టెంబర్ 30లోగా చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని, అలాగే ఈ ప్రక్రియలో దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేసింది.ఈ ప్రక్రియ పూర్తైన వెంటనే అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రతి నెల యథావిధిగా పింఛన్లు అందుతాయని తెలిపారు.

నిరుద్యోగులకు భారీ గుడ్‌న్యూస్

హైదరాబాద్, సెప్టెంబర్ 24: తెలంగాణలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కసరత్తు చేస్తోంది. సహాయ ఆచార్యులు/అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు సంబంధించిన మొత్తం 544 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్తగా జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీఓ) ఆధారంగా నియామక విధానంలో కొన్ని మార్పులు చేయనున్నారు. ఇటీవల టీజీపీఎస్సీలో జరిగిన సమావేశంలో ఈ పోస్టుల భర్తీకి సంబంధించి రెండు, మూడు అంశాలపై స్వల్ప మార్పులు సూచించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వివరాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు కమిషన్‌కు పంపించినట్లు ఓ అధికారి తెలిపారు.

◆ 2013 తర్వాత మళ్లీ భర్తీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులను చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో భర్తీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 491 అధ్యాపకులు, 24 లైబ్రేరియన్లు, 29 ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులు కలిపి మొత్తం 544 ఖాళీల భర్తీకి 2022 డిసెంబరులో నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఆ నోటిఫికేషన్‌పై పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా యూజీసీ మార్గదర్శకాలను పాటించలేదని, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు సంబంధించిన విద్యార్హతల విషయంలో అభ్యంతరాలు రావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. పాత నోటిఫికేషన్‌లో రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉండేది. అయితే ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 12న జీఓ-4 జారీ చేసింది. కొత్త విధానం ప్రకారం అభ్యర్థుల ఎంపికలో అకడమిక్ ప్రతిభకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అకడమిక్ ప్రతిభ -- 50 మార్కులు, రాత పరీక్ష -- 40 మార్కులు, ఇంటర్వ్యూ -- 10 మార్కులు చొప్పున మొత్తం 100 మార్కుల ప్రాతిపదికన ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు సమాచారం. కొత్త జీఓకు అనుగుణంగా నోటిఫికేషన్‌లో నిబంధనలు, అర్హతలకు సంబంధించిన అంశాలను పొందుపరచనున్నారు.

◆ రాష్ట్రంలో పెరిగిన డిగ్రీ కళాశాలలు

రాష్ట్రంలో మూడేళ్ల క్రితం 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 150కి పెరిగింది. వీటిలో అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు కలిపి మొత్తం 4,098 మంజూరు పోస్టులు ఉన్నాయి. స్తుతం సుమారు 1500 మంది రెగ్యులర్ అధ్యాపకులు, 2000 మంది అతిథి అధ్యాపకులు, సుమారు 400 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నట్లు సమాచారం. దీంతో కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరత కొనసాగుతోంది.

◆ మరో 1000 పోస్టుల భర్తీకి

ప్రతిపాదనలు

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కొత్తగా కనీసం 2,000 పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం 544 ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఉండటంతో తొలుత ఆ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. మరోవైపు మరో 1000 ఖాళీల భర్తీకి ఆమోదం ఇవ్వాలని కళాశాల విద్యాశాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం ఆ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే, వాటి భర్తీకి ప్రత్యేకంగా మరో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో కొత్త నోటిఫికేషన్‌పై ఆసక్తి నెలకొంది. టీజీపీఎస్సీ అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, పరీక్ష విధానం, దరఖాస్తు తేదీలపై స్పష్టత రానుంది.

ఖైరతాబాద్‌కు త్వరలో ఉప ఎన్నిక

మొదటిపేజీ తరువాయి

అక్టోబర్ 6న దేశంలో వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ?స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగిసి..ప్రచారాలు నడుస్తున్నాయి. కాబట్టి ఖైరతాబాద్ ఆ చాన్స్ మిస్సయ్యింది. అయితే ఇప్పటి నుంచి ఏవైనా స్థానాలు ఖాళీ అయితే గనుక ఈసీ అధికారిక షెడ్యూల్ అతిత్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. లేదంటే ఖాళీపై అధికారిక సమాచారం అందిన వెంటనే ఎన్నికల సంఘం తన ప్రక్రియను ప్రారంభించే చాన్స్ ఉంది.

సాధారణంగా ఇలాంటి కేసుల్లో.. సీటు ఖాళీ విషయాన్ని శాసనసభ ఈసీకి తెలియజేయాల్సి ఉంటుంది. అయితే హైకోర్టు తీర్పు తర్వాత దానం సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో అసెంబ్లీ నుంచి ఈసీకి సమాచారం వెళ్లే అవకాశం ఉంది. నియోజకవర్గ పరిస్థితులు, ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి ఈసీ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను నిర్ణయిస్తుంది.

హైదరాబాద్ లో టీజీ సేఫ్ స్పెషల్ డ్రైవ్.. లక్కీ సహా 8 రెస్టారెంట్ల లైసెన్స్ లు రద్దు

మొదటిపేజీ తరువాయి

అధికారుల తనిఖీల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిత్యం రద్దీగా ఉండే లక్కీ రెస్టారెంట్ నిర్వహణ చూసి అధికారులు షాకయ్యారు. తనిఖీల్లో బొద్దింకలు, ఎలుకలు, ఈగలు, ఎలుకల మల విసర్జన ఉన్నట్లుగా గుర్తించారు.

ఎక్స్‌పైర్డ్ ఫుడ్, పాడైన కూరగాయలు గుర్తించి అక్కడికక్కడే డిస్పోజ్ చేశారు. ఫుడ్ హ్యాండ్లర్లలో పరిశుభ్రత లోపాలు, వాటర్ రిపోర్ట్స్, హెల్త్ రికార్డులు, పెస్ట్ కంట్రోల్ రికార్డులు లేకపోవడం చూసి అధికారులు ఆందోళనకు గురయ్యారు.

16 ఫుడ్ శాంపిల్స్‌ను కల్తీ అనుమానంతో సేకరించారు అధికారులు. లక్కీ రెస్టారెంట్‌ను FSSAI లైసెన్స్ లేకుండా నిర్వహించడంతో మూసివేతకు ఆదేశాలిచ్చారు. భారీ బొద్దింకల బెడద, అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నట్లు గుర్తించారు.

రెస్టారెంట్లకు 5 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేసి, రీ-ఇన్‌స్పెక్షన్ చేయనున్నారు. 8 రెస్టారెంట్ల FSSAI లైసెన్సులు సస్పెండ్ చేసి వెంటనే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. పాక్వాన్ గ్రాండ్‌లో 1,170 కిలోల ఎక్స్‌పైర్డ్ రైస్ బ్యాగులు, 45 కిలోల లేబులింగ్ లోపాలున్న నూడుల్స్ గుర్తించారు.

ఇద్దరు ఆచార్యులు.. రెండు విభిన్న పుస్తకాలు.. ఒకే వేదిక!

ఒకటి అర్థశాస్త్రం... మరొకటి భాషా, సాహిత్య శాస్త్రం. ఈ విభిన్నమైన శాస్త్రాలకు చెందిన రెండు వేర్వేరు పుస్తకాలు బుధవారం (సెప్టెంబర్ 23) హైదరాబాద్‌లో ఒకే వేదికపై, ఏకకాలంలో ఆవిష్కరణ జరుపుకొన్నాయి. ఆ పుస్తకాలు రాసిన రచయితలిద్దరూ ఆయా శాస్త్రాలలో విశ్వవిద్యాలయ ఆచార్యులు కావడం ఒక విశేషమైతే, నిజ జీవితంలో భార్యాభర్తలు కావడం మరో విశేషం. రెండు పుస్తకాలూ లాభాపేక్ష రహితంగా ప్రముఖ ప్రచురణ సంస్థ 'ఎమెస్కో బుక్స్' ప్రచురించినవే.

ఒకటి – హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్.సి.యు)లో అర్థశాస్త్ర ఆచార్యులుగా పనిచేసి, 'సాక్షి' దినపత్రికలో అనేక వ్యాసాలు రాసిన జంగా మనోహర్ రావు రాసిన 'ప్రపంచీకరణ వీచికలు' పుస్తకం. మరొకటి – తెలుగు విశ్వవిద్యాలయంలో నిఘంటు నిర్మాణ శాఖలో ఆచార్యులుగా పనిచేసిన అయినవోలు ఉషాదేవి 'భాష -- సాహిత్యం (వివేచన... విశ్లేషణ)' వ్యాసాల సంపుటి.

సీనియర్ సంపాదకులు, 'సాక్షి' మీడియా గ్రూప్ మాజీ ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి 'ప్రపంచీకరణ వీచికలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలీగఢ్ ముస్లిమ్ యూనివర్సిటీలో పీజీ చదివి, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జె.ఎన్.యు)లో ఔషధ పరిశ్రమపై పీహెచ్‌డీ చేసి, బడ్జెట్ వ్యవహారాల నిపుణుడిగా పత్రికకు వ్యాసాలు రాస్తూ, వివిధ తెలుగు, ఉర్దూ టీవీ ఛానళ్ళలో విషయ నిపుణుడిగా చర్చల్లో పాల్గొంటూ వస్తున్న సుదీర్ఘ అనుభవం రచయిత ఆచార్య జంగా మనోహర్‌రావుది. జంగా మనోహర్‌రావు, మరో సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్, చరిత్ర శాఖ ఆచార్యులు వకుళాభరణం రామకృష్ణ... ముగ్గురూ దాదాపు ఒకే సమయంలో ఢిల్లీలోని జె.ఎన్.యు.లో పరిశోధన సాగించినవారే! ఆ సంగతులను వక్తలు తమ మాటల్లో ప్రస్తావించారు.

మాజీ DSP భీమ్‌రెడ్డి కేసులో బినామీలపై ఏసీబీ ఫోకస్.. 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే భీమ్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు చేసిన అధికారులు.. తాజాగా ఆయనతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న బినామీలపై దృష్టి సారించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో అనుమానిత బినామీలకు సంబంధించిన ఇళ్లపై ఏసీబీ అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మొత్తం ఎనిమిది మంది అనుమానిత బినామీలకు సంబంధించిన ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఏసీబీ డీఎస్పీ జి. శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ సోదాలు కొనసాగాయి. సోదాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, ఇతర ఆర్థిక రికార్డులను అధికారులు పరిశీలించారు. భీమ్‌రెడ్డితో అనుమానితుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాల కోసం ఆరా తీసినట్లు ఏసీబీ తెలిపింది. స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర ఆధారాలను విశ్లేషించి వాటికి కేసుతో ఉన్న సంబంధాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

తాజా సోదాల్లో కొన్ని చోట్ల నగదు, విదేశీ కరెన్సీ లభించినట్లు సమాచారం. వీటితో పాటు కీలక పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. భీమ్‌రెడ్డి కేసులో ఏసీబీ గత జూలైలో తెలంగాణ, కర్ణాటకల్లోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఆయన బంధువులు, స్నేహితులు, అనుమానిత బినామీలు, ఇతర సంబంధిత వ్యక్తులకు చెందిన ప్రాంతాల్లోనూ తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో నగదు, బంగారం, వెండి, బ్యాంకు నిల్వలకు సంబంధించిన వివరాలతో పాటు పలు స్థిరాస్తుల పత్రాలను అధికారులు గుర్తించారు. ఆ సోదాల్లో భీమ్‌రెడ్డి నివాసంలో రూ.3.60 లక్షల నగదు, ఒక అనుమానిత బినామీ ఇంట్లో రూ.40 లక్షల నగదు లభించినట్లు ఏసీబీ వెల్లడించింది.

సుమారు రెండు కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, దాదాపు రూ.19.91 లక్షల బ్యాంకు నిల్వలకు సంబంధించిన వివరాలు కూడా బయటపడ్డాయి. వివిధ ప్రాంతాల్లో విల్లాలు, ఇళ్లు, ఫ్లాట్లు, వాణిజ్య ఆస్తులు, వ్యవసాయ భూములకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించారు. భీమ్‌రెడ్డి కేసులో అసలు ఆస్తుల యాజమాన్యం ఎవరిది? బినామీల పేర్లపై ఉన్న ఆస్తులకు భీమ్‌రెడ్డితో ఏమైనా సంబంధం ఉందా? ఆస్తుల కొనుగోళ్లకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? అనే అంశాలపై ఏసీబీ దర్యాప్తు సాగుతోంది. తాజా సోదాల్లో లభించిన పత్రాలు, నగదు, ఇతర ఆధారాలను విశ్లేషించిన తర్వాత ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు బినామీ ఆస్తులకు సంబంధించిన ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించాల్సిన అవసరం లేదు. ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది.

తూప్రాన్‌లో 'రాష్ట్రకూటుల' శౌర్యం

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి వందల సంవత్సరాల వైభవోపేతమైన, అరుదైన చరిత్ర ఉందనడానికి బలమైన సాక్ష్యాలు లభించాయి. ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కె.పి.రాజ్ కుమార్ నేతృత్వంలో సాగిన క్షేత్రస్థాయి పరిశోధనల్లో క్రీస్తు శకం 8వ శతాబ్దం, 11వ శతాబ్దాలకు చెందిన అత్యంత అరుదైన వీరగల్లు శిల్పాలు, శాసనాలు వెలుగుచూశాయి. స్థానిక రామాలయం ప్రాంగణంతో పాటు ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ఈ చారిత్రక సంపదను ఆయన గుర్తించారు.

ఈ పరిశోధనల్లో లభించిన శిల్పాలలో క్రీస్తు శకం 8వ శతాబ్దపు రాష్ట్రకూటుల శైలికి చెందిన వీరగల్లు అత్యంత అద్భుతమైనదిగా నిలిచిందన్నారు. ప్రజల రక్షణ కోసం, మోక్ష సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసిన ఒక వీరుని స్మృతిలో అతని తదనంతరం ఈ శిల్పాన్ని చెక్కించినట్లు తెలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ ఒక కుల నాయకుడు కాదు
భారతరత్న అంబేద్కర్ అందరివాడు

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

దళితుడైన హమారా ప్రసాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారిపై రాసిన 'కల్పిత నాయకుడు' అనే పుస్తకం సృష్టించిన వివాదంపై ఒక వీడియో ఇంటర్వ్యూలో యాంకర్ సంపత్ కుమార్ అడిగిన ప్రశ్నలకు, ప్రొఫెసర్ మురళీ మనోహర్ గారు తన విశ్లేషణను, వివరణను అందించారు.

▪ ప్రొఫెసర్ పుట్టి మురళీ మనోహర్ భారతదేశంలోని ప్రముఖ విద్యార్థి సంఘమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మాజీ జాతీయ అధ్యక్షుడు. ఆయన విద్యావేత్తగా, సామాజిక విశ్లేషకునిగా మరియు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సీనియర్ నాయకుడిగా సమాజంలో గుర్తింపు పొందారు.

▪ **పుస్తకం మరియు వివాదం**

ఒక దళిత హిందువుగా చెప్పుకునే హమారా ప్రసాద్ అనే వ్యక్తి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారిపై 'కల్పిత నాయకుడు' అనే పేరుతో పుస్తకం రాయడం తీవ్ర అభ్యంతరాలకు దారితీసింది.
"కల్పిత" అనే పదంలోనే అంబేద్కర్ గారిని చిన్నచూపు చూసే ఉద్దేశం కనిపిస్తోందని ప్రొఫెసర్ పేర్కొన్నారు.

▪ **రచనా స్వేచ్ఛ**

ఒక వ్యక్తిగా హమారా ప్రసాద్ కు పుస్తకం రాసే హక్కు ఉంది. గతంలో అంబేద్కర్ గారు కూడా హిందూ దేవతలపై "రిడిల్స్ ఇన్ హిందూయిజం" అనే పుస్తకం వ్రాశారు.
ఆర్ఎస్ఎస్ అంబేద్కర్ ఆలోచనలను సమర్థించనప్పటికీ, ఆ పుస్తక ముద్రణను వ్యతిరేకించలేదని అన్నారు.

▪ రాజ్యాంగ రచయితగా అంబేద్కర్ గారు అందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛను, భావ ప్రచురణా స్వేచ్ఛను ఇచ్చారు. ఈ రకంగా హమారా ప్రసాద్ కు కూడా ఆ స్వేచ్ఛ ఉంది.

కానీ,రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) ప్రకారం తూలనాటడం తప్పు. హమారా ప్రసాద్ పుస్తకము చదివితే తప్ప అది సద్విమర్శనా లేక దూషణనా అనే విషయం అర్థం కాదు.

▪ **ఆర్ఎస్ఎస్ మరియు అంబేద్కర్ గారిపై ఉన్న అపవాదులు**

హమారా ప్రసాద్ పుస్తకంతో ఆర్ఎస్ఎస్ కి సంబంధం లేదు. ఈ పుస్తకం వెనుక ఆర్ఎస్ఎస్ లేదా బిజెపి ప్రోత్సాహం ఉందనే ఆరోపణలను ప్రొఫెసర్ పూర్తిగా ఖండించారు. హమారా ప్రసాద్‌కి, ఆర్ఎస్ఎస్ కి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

▪ **అంబేద్కర్ ప్రాతఃస్మరణీయుడు**

ఆర్ఎస్ఎస్ కార్యాలయాల్లో నిత్య శాఖలో ప్రతిరోజూ ఉదయం చేసే ప్రాతః స్మరణలో దేశభక్తుల పేర్లతో పాటు గత 40 ఏళ్లుగా గాంధీజీ, అంబేద్కర్ గారి పేర్లను కూడా స్మరిస్తున్నారని తెలిపారు.

"ఆర్ఎస్ఎస్ దృష్టిలో అంబేద్కర్ గారు ఒక ఆరాధ్యుడు మరియు మహాపురుషుడు. ఈ విషయం అంబేద్కరిస్టులకు తెలియదు."

▪ **సామాజిక సమరసత మంచ్**

కుల వివక్షకు వ్యతిరేకంగా పనిచేసే ఆర్ఎస్ఎస్ వింగ్ సామాజిక సమరసత మంచ్ 1983లో సరిగ్గా అంబేద్కర్ గారి జయంతి రోజైన ఏప్రిల్ 14న ప్రారంభమైందని గుర్తుచేశారు.

▪ **అంబేద్కర్ అనుయాయుల తప్పులు**

గాంధీజీని అందరి నాయకుడిగా చూసినప్పుడు, అంబేద్కర్ గారిని కేవలం ఒక కుల నాయకుడిగా మార్చడంలో ఆయన అనుయాయుల అతి ఉత్సాహం కూడా ఒక కారణమని ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. ఆయన అందరివాడు, దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి.

▪ **హిందుత్వ వ్యతిరేక ముసుగు**

▪ అంబేద్కర్ వాదులం అనే ముసుగులో కొంతమంది హిందూ దేవీ దేవతలను దూషిస్తూ, సాధారణ హిందువులలో అంబేద్కర్ గారి పట్ల ద్వేషభావం ఏర్పడేలా చేస్తున్నారని స్పష్టం చేశారు.

కమ్యూనిస్టుల వైఖరి

▪ **1925 నుండి 1956 వరకు పార్లమెంట్ లోపల, బయట అంబేద్కర్ గారిని తీవ్రంగా దూషించిన కమ్యూనిస్టులు, 1983 తర్వాత రాజకీయ ప్రయోజనాల కోసం ఆయన్ను నెత్తిన పెట్టుకొని ఆర్ఎస్ఎస్ పై దాడి చేస్తున్నారని విమర్శించారు.**

దళితుల నుండి క్రైస్తవులుగా మారిన కొందరు కమ్యూనిస్టు అవతారం ఎత్తుతుంటారు. అప్పుడు రెట్టించిన అజ్ఞానంతో హిందుత్వం పై దాడి చేస్తారు. దీనివల్ల సాధారణ హిందువులు అంబేద్కర్ ను విమర్శించాలని కోరుకుంటారు.

▪ వారు కోరుకున్నట్టే ఎవరైనా హిందువులు అంబేద్కర్ ను విమర్శిస్తే దానికి ఆర్ఎస్ఎస్ ను కారణంగా చూపుతారు. ఇదంతా అంబేద్కర్ అనుయాయులుగా చెప్పుకుంటున్న సూడో అంబేద్కరిస్టులకుట్ర.

అంబేద్కర్ సిద్ధాంతాలు నిజం

▪ నేషన్ ఫస్ట్ .. దేశమే ప్రథమం.. అనేది అంబేద్కర్ ప్రభలమైన ఆచరణంగా ఉండేది. అంబేద్కర్ గారు ఎల్లప్పుడూ మాతృభూమి



పట్ల నిబద్ధతను కలిగి ఉండాలన్నారు. దేశ విభజన సమయంలో ఇస్లామిక్ బ్రదర్‌హుడ్ గురించి ఆయన రాసిన పుస్తకాల్లోని నిజాలను ఇప్పటి సెక్యులరిస్టులు ఒప్పుకోరని మురళి మనోహర్ గారు అన్నారు.

మతం మార్పిడి

అంబేద్కర్ హిందూ సమాజానికి బుద్ధి చెప్పాలనుకున్నా, దేశీయ సంస్కృతిని వీడకూడదనే ఉద్దేశంతోనే ఇస్లాం లేదా క్రైస్తవ మతాల్లోకి వెళ్లకుండా ఈ మట్టిలోనే పుట్టిన బౌద్ధ మతాన్ని స్వీకరించారని స్పష్టం చేశారు.

ఆర్య-ద్రవిడ సిద్ధాంత తిరస్కరణ

కమ్యూనిస్టులు ప్రచారం చేసే ఆర్య-ద్రవిడ సిద్ధాంతం తప్పని అంబేద్కర్ గారు పరిశోధనల ద్వారా కొట్టిపారేశారని తెలిపారు.

బ్రాహ్మణ సమాజంపై వైఖరి

అంబేద్కర్ బ్రాహ్మణులను వ్యతిరేకించలేదు, కేవలం బ్రాహ్మణ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించారన్నారు. ఆయన రెండవ భార్య డాక్టర్ సవిత గారు కూడా బ్రాహ్మణ మహిళేనని, ఆమె చేసిన సేవలను అంబేద్కర్ తన పుస్తకాల్లో స్వయంగా కొనియాడారని గుర్తు చేశారు.

హమారా ప్రసాద్ రాసిన పుస్తకం విడుదలయ్యాక అందులోని అంశాలను చదివి, తప్పులు ఉంటే గట్టిగా విమర్శించే హక్కు అందరికీ ఉందని అన్నారు.

▪ భావ ప్రకటన స్వేచ్ఛ ప్రసాదించిన భారత రాజ్యాంగ రచయిత అయిన అంబేద్కర్ బ్రతికి ఉంటే తన పేరుతో సూడో అంబేద్కరిస్టుల అపరిపక్వ రాజ్యాంగ,ప్రజాస్వామ్య ఆచరణను విమర్శించే వారని ఆయన అన్నారు.

రాజ్యాంగం చట్టం విషయం పక్కన పెట్టి క్రైస్తవం స్వీకరించిన దళితులు, దారి తెన్ను లేని కమ్యూనిస్టులు ఈ వివాదాల్లోకి ఆర్ఎస్ఎస్ ను లాగే ప్రయత్నం చేశారు .

ఆర్ఎస్ఎస్ అంబేద్కర్ ను విమర్శించింది అని బూటకపు ప్రచారం చేస్తూ దళితులలో భావోద్వేగాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చెల్లదని, దళితులే నిజమైన హిందువులని ఆయన అన్నారు.

1954 లో మహారాష్ట్రలోని భండారా లోక్‌సభ ఉపఎన్నికలో డా. బి.ఆర్. అంబేద్కర్ పోటీ చేసినప్పుడు, ఆరెస్సెస్ ప్రచారక్ మరియు ప్రముఖ కార్మిక నాయకుడైన దత్తోపంత్ తేంగ్డే ఆయనకు ఎన్నికల ఏజెంట్ గా వ్యవహరించారు. దత్తోపంత్ తేంగ్డే రాసిన "డాక్టర్ అంబేద్కర్ ఔర్ సామాజిక్ క్రాంతి కీ యాత్ర" అనే పుస్తకం అంబేద్కర్ కు ఆర్ఎస్ఎస్ కు మధ్యలో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది.

తేంగ్డే గారు అంబేద్కర్ స్థాపించిన షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ లో సెక్రటరీగా కూడా పనిచేశారని, వారిద్దరి మధ్య ఉన్న పరస్పర నమ్మకం వల్లే అంబేద్కర్ ఆయన్ను తన ఎన్నికల ఏజెంట్‌గా నియమించుకున్నారని చరిత్ర సాక్ష్యం చెబుతున్నది. ఆ ఎన్నికల్లో అంబేద్కర్ తరపున భండారా నియోజకవర్గంలోని ఆరెస్సెస్ స్వయంసేవకులు విస్తృతంగా ప్రచారం చేశారన్న వాస్తవాన్ని కప్పిపుచ్చలేరు.

▪ ఒక వ్యక్తిగా హమారా ప్రసాద్ రాసిన పుస్తకాన్ని సాకుగా చూపి ఆర్ఎస్ఎస్ పై లేదా హిందుత్వంపై చల్లే బురద వారిపైనే పడుతుంది అని ప్రొఫెసర్ మురళీ మనోహర్ గారు తేల్చిచెప్పారు.

కానీ, భారతదేశంలో సామరస్యాన్ని దెబ్బతీసి సమాజాన్ని ముక్కలుగా విడగొట్టాలనుకునే శక్తులు అంబేద్కర్ ను కేవలం దళిత నాయకుడు గా ముద్ర వేశారు.

▪ అందరివాడు గా బతికిన అంబేద్కర్ ను కేవలం ఒక కుల నాయకుడిగా మార్చిన బ్రిటిష్ వారి కుట్రలను ఇప్పటికీ అనుసరిస్తున్న కమ్యూనిస్టులు, క్రిప్టో క్రైస్తవులు మాత్రమే అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని తక్కువ చేసి చూపుతున్నారని అన్నారు.

భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి చారిత్రక పాత్రను,వారసత్వాన్ని, స్మృతిని గౌరవిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆయన జీవితానికి సంబంధించిన ఐదు ముఖ్యమైన ప్రాంతాలను "పంచ తీర్థాలు" గా అభివృద్ధి చేసింది.

ఆ ఐదు ప్రాంతాలు:

1.జన్మ భూమి
మవ్, మధ్యప్రదేశ్ లో బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మించిన ప్రదేశం.

2.శిక్షా భూమి
అంబేద్కర్ గారు ఉన్నత చదువుల కోసం లండన్ లో ఉన్నప్పుడు నివసించిన ఇల్లు. దీనిని భారత ప్రభుత్వం కొనుగోలు చేసి స్మారక చిహ్నంగా మార్చింది.

3.దీక్షా భూమి
నాగ్‌పూర్, మహారాష్ట్ర లో అంబేద్కర్ గారు బౌద్ధమతాన్ని స్వీకరించిన పవిత్ర స్థలం.

4.మహాపరినిర్వాణ భూమి
ఢిల్లీ లో అంబేద్కర్ గారు తన చివరి రోజులను గడిపి, మహాసమాధి చెందిన, 26 అలీపూర్ రోడ్ లోని ప్రదేశం. ఇక్కడ డాక్టర్ అంబేద్కర్ జాతీయ స్మారక కేంద్రాన్ని నిర్మించారు.

5.చైత్య భూమి
ముంబై, మహారాష్ట్ర లో అంబేద్కర్ గారి అంత్యక్రియలు నిర్వహించిన పవిత్ర ప్రదేశం.

ఈ ఐదు ప్రాంతాలను కలుపుతూ పర్యాటకాన్ని, మౌలిక వసతులను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా "అంబేద్కర్ సర్క్యూట్" రైలు సర్వీసులను కూడా ప్రారంభించింది.

▪ అంబేద్కర్ మహాశయునికి బిజెపి ప్రభుత్వం మోదీ ఆధ్వర్యంలో భారతదేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ అందించని గౌరవాన్ని అందించింది. దళితులు బిజెపి వైపు, జాతీయ వాదం వైపు వస్తే తమ పునాదులు కదులుతాయని భావించిన వ్యక్తులు రాజకీయ శక్తులు అంబేద్కర్ ను ఒక కులానికి పరిమితం చేసి వికృత ఆటలాడుకుంటున్నారు.

అంబేద్కర్ ను అణగారిన వర్గాలకు మాత్రమే ప్రతినిధిగా చూపుతూ ఆ మహా నాయకుని వ్యక్తిత్వాన్ని అతని అనుయాయులుగా చెప్పుకుంటున్న సూడో అంబేద్కరిస్టులు కించపరుస్తున్నారు.

▪ రాజ్యాంగ రచనలో అంబేద్కర్ గారు భారతీయులందరి హక్కుల గురించి, అందరి భావ స్వేచ్ఛ గురించి, దేశం పట్ల అందరి బాధ్యత గురించి సవివరమైనటువంటి ఆర్టికల్స్ పొందుపరిచాడు.

అంబేద్కర్ అందరివాడు. అంబేద్కర్ భారతరత్న.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వ్రాసిన సాహిత్యం పుస్తకాలు చదవకుండా అల్లరి చేసే మూకలు అంబేద్కర్ రచనలన్నీ చదవాలని మురళీ మనోహర్ గారు గట్టిగా సూచించారు.

రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్ ని పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 24

రిటైర్డ్ డీసీపీ శ్రీ సుదర్శన్ గౌడ్ ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం పరామర్శించారు.పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలందించి, తన సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు, సేవా పతకాలు అందుకున్న బ్యాచ్‌మేట్, మిత్రుడు సుదర్శన్ గౌడ్ గారిని భీమారంలోని వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే నాగరాజు ఆప్యాయంగా కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ తో కొంతసేపు ముచ్చటించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి,

తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాసేవలో పోలీస్ శాఖలో బాధ్యతాయుతమైన పదవుల్లో పనిచేసిన సుదర్శన్ గౌడ్ గారితో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్యే నాగరాజు గారు గుర్తుచేసుకున్నారు. పరస్పరం యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.అనారోగ్య సమయంలో ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందించే ధైర్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు పేర్కొంటూ, సుదర్శన్ గౌడ్ గారు త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు.

ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో జీవీఆర్ అకాడమీ ప్రతిభ

కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 24

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) హైదరాబాద్ జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీల్లో జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు ఘన విజయం సాధించారు. వివిధ విభాగాల్లో పోటీపడి పలు పతకాలు కైవసం చేసుకున్నారు. ఇందులో స్వర్ణ పతకాలు సాధించిన అక్షయిని (-32 కేజీలు), ఆకుల రోహిక (-40 కేజీలు), ఎ. అక్షిత (-48 కేజీలు), గౌతమి (o68 కేజీలు), జి. అవిఘ్న వెంకట్ రెడ్డి (-45 కేజీలు) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే చిన్మయి ప్రియ కాంస్యం, శ్రిత రజత పతకం సాధించారు.విజేతలకు ఉస్మానియా విశ్వవిద్యాలయ పీడీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. దీప్లా, అవంతి కళాశాల పీడీ డైరెక్టర్ డాక్టర్ బి. లక్ష్మయ్య పతకాలు అందజేసి అభినందించారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక, వ్యక్తిగత సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య..చికిత్స పొందుతూ మృతి

కరపత్రం ప్రతినిధి వరంగల్,సెప్టెంబర్ 24

ఆర్థిక,వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా,దచికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వంచనగిరి గ్రామానికి చెందిన ఎడ్లె రవికుమార్ (42) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత కొంతకాలంగా ఆర్థిక,వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో ఈ నెల 20న ఉదయం 10.30 గంటల సమయంలో గ్రామంలోని బతుకమ్మ గద్ద సమీపంలో పారాక్వాట్ గడ్డిమందు సేవించినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు.వెంటనే రవికుమార్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఏకశిల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అయితే పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం 11 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి భార్య ఎడ్లె సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు.తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని,గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న ఆర్థిక,వ్యక్తిగత సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గణేష్ నిమజ్జనం విజయవంతం

» ధన్యవాదాలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, సెప్టెంబర్ 24

హుజురాబాద్ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిసిన సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పట్టణ ప్రజలకు, అధికారులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు నిర్వహించారని, పదో రోజు బుధవారం భారీ వర్షం కురిసినా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని చైర్మన్ కొనియాడారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ, వార్డుల మండపాల ఉత్సవ కమిటీలు, పట్టణ పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య, విద్యుత్ శాఖల సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.హుజురాబాద్ ఆర్డీఓ జల కుమారి, ఏసీపీ మాధవి, తహసీల్దార్ నరేందర్, టౌన్, రూరల్ సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, పోలీస్ శాఖ, మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్, వినాయక మండపాల కమిటీలు, మహిళలు, యువకులు, ప్రజలు, ప్రెస్ క్లబ్, మీడియా మిత్రులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 25,2026

విద్యానగర్ లో ఘనంగా శ్రీ లక్ష్మి గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు..

- 108 రకాల ప్రసాదాలతో మహా నైవేద్యం.. 1008 దీపాలతో గణనాథునికి ప్రత్యేక అలంకరణ

కరపత్రం ప్రతినిధి హనుమకొండ, సెప్టెంబర్ 24

హనుమకొండ విద్యానగర్ లోని కాలనీవాసులు నిర్వహించిన శ్రీ లక్ష్మి గణపతి గజానన మండలి 13వ గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. 9 రోజుల పాటు కాలనీవాసులు ఐకమత్యంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించి గణనాథుని పట్ల తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా కాలనీ మహిళలు ప్రత్యేక భక్తి శ్రద్ధలతో స్వామివారిని కొలుస్తూ 108 రకాల ప్రసాదాలను స్వయంగా తీసుకువచ్చి గణనాథునికి మహా నైవేద్యంగా సమర్పించారు. ఐదో రోజు శుక్రవారం మహిళలంతా కలిసి అమ్మవారి కుంకుమ పూజ నిర్వహించారు. మరో రోజు 1008 దీపాలతో గణేష్ మండప ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించి భక్తి శోభను తీసుకువచ్చారు. గోపాలపూర్ కు చెందిన అభయ ఆంజనేయస్వామి భజన బృందం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గణనాథుని విగ్రహాన్ని తుమ్మ శ్రీనివాస్‌రెడ్డి–శ్రీవాణి దంపతులు దాతలుగా అందించడం ఉత్సవాలకు ప్రత్యేకతను తీసుకువచ్చింది. అదేవిధంగా వర్ధాల నాగరాజు–రాధిక దంపతులు సుమారు 800 మంది భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల నిర్వహణలో దాతలు అందించిన సహకారం, మహిళలు చూపిన భక్తిశ్రద్ధలు ప్రత్యేకంగా నిలిచాయి.ముగింపు రోజు నిర్వహించిన లక్కీ డ్రాలో తొలి లడ్డూను తుమ్మ శ్రీనివాస్‌రెడ్డి––శ్రీవాణి దంపతులు దక్కించుకున్నారు. మరో రెండు లడ్డూలను వేలం పాటలో దాసరి సమ్మయ్య–– స్వరూపరాణి రూ.8 వేలకు, పొడిశెట్టి జయసేన రూ.7,100కు దక్కించుకున్నారు. శ్రీ లక్ష్మి గణపతి గజానన మండలి అధ్యక్షుడు వీరమనేని సోమేశ్వర్‌రావు, కార్యదర్శి నాగపురి సమ్మయ్య, కోశాధికారి కోరుట్ల సత్యనారాయణ, కోరుట్ల రమేష్, వద్దాల నాగరాజు ఆధ్వర్యంలో దాతలు, కమిటీ సభ్యులు,మహిళలను ఘనంగా సన్మానించి, మెమెంటోలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు గణనాథుని నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, కాలనీవాసులందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాల సందర్భంగా మహిళలు, యువత, దాతలు, కమిటీ సభ్యులు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రతి కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణనాథుని అనుగ్రహంతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు దిగ్విజయంగా ముగియడంతో కాలనీలో భక్తి, ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అనంతరం డప్పు చప్పుళ్ళు, కోలాటాల మధ్య గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

నేరెళ్ల శారదను సన్మానించిన చైర్మన్ పింగళి, డిసిసి అధ్యక్షుడు ఇనుగల

- మహిళల హక్కుల పరిరక్షణకు మరింత కృషి చేయాలి మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలి

కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 24

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేరెళ్ల శారదను పీసీసీ చైర్మన్, డీసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్, హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నరసింహారెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగల వెంకట్రామ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా కమిషన్ కార్యాలయంలో నేరెళ్ల శారదను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మహిళల హక్కుల పరిరక్షణ, భద్రత, సాధికారత కోసం మహిళా కమిషన్ కీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా కమిషన్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, వారికి అండగా నిలిచే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేరెళ్ల శారద నాయకత్వంలో మహిళా కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేస్తూ, ఆమెకు పదవీ బాధ్యతల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగల వెంకట్రామ్ రెడ్డి కూడా నేరెళ్ల శారదకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత దిశగా కమిషన్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు

గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా మండి బజార్ జెండా కమిటీ సభ్యులు

- మహ్మద్ అబ్దుల్ బాసిత్ తాహెర్ జెండా కమిటీ ఆధ్వర్యంలో
- వినాయక భక్తులకు నీరు,మిఠాయిల పంపిణీ

కరపత్రం ప్రతినిధి వరంగల్,సెప్టెంబర్ 24

గంగా జమునా తహజీబ్‌కు వరంగల్ నగరం మరోసారి చక్కటి ఉదాహరణగా నిలిచింది.మండి బజార్ అబ్దుల్ బాసిత్ తాహెర్ జెండా కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనానికి తరలివెళ్తున్న భక్తులకు నీటి సీసాలు, చిన్నారులకు మిఠాయిలు,చాక్లెట్లు పంపిణీ చేశారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మత,కుల భేదాలకు అతీతంగా మండి బజార్ జెండా కమిటీ ఇన్‌చార్జి అబ్దుల్ తాహెర్ భాయ్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.వినాయక నిమజ్జనానికి వెళ్తున్న వాహనాలను ఆపి భక్తులకు నీటిని అందించడంతో పాటు చిన్నారులకు స్వయంగా చాక్లెట్లు,మిఠాయిలు పంపిణీ చేశారు.భారీ వర్షం కురుస్తున్నప్పటికీ సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం విశేషం.ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి,ప్రస్తుత ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం,సోదరభావం,మానవత్వాన్ని చాటిచెప్పే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్లగొండ రమేష్, 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండటి నరేంద్ర, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు,ఎం.డి.మషూక్ భాయ్,ఎం.డి.మస్తాన్, వరంగల్ వాగంటి శ్రీనివాస్, మైనారిటీ కమిటీ సభ్యులు,జెండా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వినయ్ భాస్కర్‌పై దాడికి నిరసనగా కాజీపేటలో మౌన నిరసన

- పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.. ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించాలని విజ్ఞప్తి

కరపత్రం ప్రతినిధి కాజీపేట, సెప్టెంబర్ 24

మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై ఎంజీఎం ఆసుపత్రి వద్ద జరిగినట్లు పేర్కొంటున్న దాడికి నిరసనగా, బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో మౌన నిరసన పాదయాత్ర నిర్వహించారు. నల్ల దుస్తులు ధరించి, నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని ప్లకార్డులు, బ్యానర్లతో కాజీపేట జమా మసీదు నుంచి రహమతేనగర్ చౌరస్తా మీదుగా కాజీపేట చౌరస్తా వరకు మౌనంగా పాదయాత్ర చేపట్టారు.ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్, సుంచు కృష్ణ మాట్లాడుతూ.. ఎంజీఎం ఆసుపత్రిలో స్లాబ్ పెచ్చులు ఊడిపడి రోగి గాయపడిన ఘటనపై పరామర్శించేందుకు వెళ్లిన దాస్యం వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేయడం దుర్మార్గమని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంజీఎం ఆసుపత్రిని తక్షణమే నూతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి రోగులకు, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యవాదులు ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్బంధ చర్యలు పెరిగాయని వారు ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పశ్చిమ నియోజకవర్గంలోనే నిర్బంధ పరిస్థితులు నెలకొనడం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగ్, ఎండీ అఫ్జల్, డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, దువ్వ కనకరాజ్, బేధరకోట రంజిత్, కుమ్మరి కోటిలింగం, షేక్ మహమూద్, బరిగెల వినయ్, సుంచు అశోక్, గబ్బేట కరుణ్, బస్వా యాదగిరి, తేలు సారంగపాణి, దువ్వ నరేష్, పర్వీన్ బేగం, శృంగారపు బిక్షపతి, తండమళ్ళ వేణు, పదిదెల శేఖర్, రాబర్ట్, మండల సుబ్బు, గాదెపాక రమేష్, కుమ్మరి రాజ్‌కుమార్, మంద శ్రీనివాస్, అయ్యల దానం, సుంచు రఘురాం, శ్రీనాథ్, వేణిశెట్టి రఘు, మంద రాజ్‌కుమార్, పర్వపెల్లి రాజేష్, ఎస్‌డీ యాకుబ్, కుమ్మరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్ గోకుల్‌పై చర్యలు తీసుకోవాలి

- శాట్స్ ఎండీకి కయాకింగ్ అండ్ కెనోయింగ్ అసోసియేషన్ ఫిర్యాదు

కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 24

హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, హైదరాబాద్ జిల్లా యువజన క్రీడల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏ.ఎన్.కె. గోకుల్ అమానుష వైఖరి, పరిపాలనా లోపాలు మరియు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ కయాకింగ్ & కెనోయింగ్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) మేనేజింగ్ డైరెక్టర్ సోని బాల దేవిని గురువారం కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ హైదరాబాద్ కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ... గతంలో కూడా క్రీడా పరిపాలనకు సంబంధించి గోకుల్‌పై సస్పెన్షన్, క్రమశిక్షణా చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ టోర్నమెంట్‌లో ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు, వివాదాస్పద తీర్పులతో పాటు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పరిపాలనా బాధ్యతలపై కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నట్లు గుర్తుచేశారు. తాజాగా సెప్టెంబర్ 18న జరిగిన 8వ 'ఖేలో ఇండియా' సెలెక్షన్స్‌లో కయాకింగ్, కెనోయింగ్ కోచ్‌ల పట్ల ఆయన అత్యంత దూకుడుగా, దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యుల సమక్షంలోనే అసభ్యకర, అభ్యంతరకర పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఒకటి, రెండు ఎడిషన్ల 'సీఎం కప్' పోటీల్లో కూడా వాటర్ స్పోర్ట్స్ క్రీడలకు సరైన ఏర్పాట్లు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సాధారణ శిక్షణ సమయంలో అడ్డంకులు సృష్టించడమే కాకుండా, తెలంగాణ పోలీస్ జట్టు శిక్షణకు సైతం అవసరమైన సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. హైదరాబాద్ డీవైఎస్ఓ, ట్యాంక్‌బండ్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, రెజ్లింగ్ ఇన్‌ఛార్జ్‌గా ఒకే అధికారికి మూడు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్రీడాకారులు, కోచ్‌ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయనపై నిష్పాక్షిక విచారణ జరిపి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, ఆ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి అర్హులైన ఇతర అధికారులకు అప్పగించాలని అసోసియేషన్ తరఫున శాట్స్ ఎండీని ఆయన కోరారు.

ఎంజీఎం సమస్యలు పరిష్కరించాలి

వినయ్ భాస్కర్‌పై పోలీసుల దౌర్జన్యం అప్రజాస్వామికం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

కరపత్రం ప్రతినిధి వరంగల్,సెప్టెంబర్ 24

వరంగల్: ప్రజా సమస్యలపై ప్రశ్నించిన మాజీ మంత్రి,ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు.ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తే అక్రమంగా అరెస్టులు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.ఎంజీఎం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్ మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలకుల అండతో నగరంలో సరికొత్త దాడుల సంస్కృతి కొనసాగుతోందని ఆరోపించారు.ఎంజీఎంలో వైద్య వ్యవస్థ కుప్పకూలుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.ఆసుపత్రిలో ఎక్స్‌రే యంత్రాలు పనిచేయకపోవడం,ల్యాబ్‌లు మూతపడటం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.కమీషన్ల కోసం రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించాల్సిన కొందరు వైద్యులు డ్యూటీలకు గైర్హాజరవుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని నరేందర్ అన్నారు. సుమారు 600 మంది సిబ్బంది అవసరమైన చోట సగం మందితోనే సేవలు కొనసాగుతున్నాయని, దీంతో రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.గత ప్రభుత్వం నిర్మించిన 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదని నరేందర్ ప్రశ్నించారు.నూతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తక్షణమే ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు టి.రమేష్ బాబు,కె.రాజేందర్,కొంతం మోహన్, బజ్జూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.